క్లుప్తంగా

ఆపరేటర్ల నియామకానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల్లో మంచినీటి పథకాల నిర్వహణకు ఆపరేటర్లను నియమాకం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. పంచాయతీలలో మంచినీటి పథకాల నిర్వాహణకు ఇద్దరు ఆపరేటర్లను నియమించనున్నట్లు చెప్పారు. ఆపరేటర్ల నియామకం తరువాత గ్రామాల్లో తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

క్రీడాకారులకు పీఓ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా' రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి సోమవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని పీఓ ఆకాంక్షించారు. ఇటీవల పార్వతీపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో ఖోఖో విభాగంలో గొయిది సచివాలయానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 9న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ తదితరులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి



ఓపీ విభాగం వద్ద బారులు తీరిన రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి సోమవారం రోగులతో కిటకిటలాడుతూ కనిపించింది. ప్రభుత్వం ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వైద్యం కోసం ఆస్పత్రికి వస్తున్నారు. పూర్తిస్థాయిలో స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉండటంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని ప్రధాన వైద్యాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ రూరల్: వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చంద్రమౌళి అన్నారు. సోమవారం సీతంపేట రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. వాహన ధ్రువపత్రాలు, లైసెన్సులు పరిశీలించారు. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారణకు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్) విద్యాలయంలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా బోధన సాగిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు అన్నారు. పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

పాడిపశువులే.. సిరిసంపదలు

- వ్యవసాయంతో పాటు పశుపోషణ లాభదాయకం
- మేలుజాతి పశువుల ఎంపిక కీలకం
- పోషణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే సంపద వృద్ధి



సంకరజాతి గేదెలు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు పాడిపంటలే జీవనాధారం. ప్రకృతి వైపరీత్యాలు,, ధరల పతనం, దళారుల మోసాలతో రైతులు వ్యవసాయంలో నష్టాలు చవిచూసినపుడు పాడిపశువులు అన్నదాతకు ఆసరాగా నిలిచి ఆదుకుంటున్నాయి. ప్రభుత్వాలు కూడా వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. పశుపోషణలో రైతులు సరైన అవగాహన పెంచుకుంటే సంపద వృద్ధి చెందుతుందని పశుసంవర్ధకశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. మేలుజాతి పశువుల ఎంపిక, వాటి పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ, తదితర అంశాలపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పశుపోషణలో సరైన యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే పశుసంపద వృద్ధి చెందడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని అంటున్నారు. పశుసంవర్ధకశాఖ గణాంకాల ప్రకారం కురుపాం నియోజకవర్గంలో కురుపాం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సుమారు 65 వేల ఆవులు, గేదెలు ఉన్నాయి.

ఉత్తమ జాతుల ఎంపిక మేలు..

పాడి పరిశ్రమలో అధిక లాభాలు పొందాలంటే మేలుజాతి పశువులను ఎంచుకోవాలి. అధిక పాలు నిచ్చే మేలుజాతి ముర్రాగేదె, సంకరజాతి ఆవులను పోషించాలి. పశువులకు సమతుల్య ఆహారం ఇవ్వాలి. నీరు, నీడ, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలి. ప్రాంతాలకు తగ్గట్టు పశువుల జాతులను ఎంపిక చేసుకోవాల్సి వుంటుంది. ఈత తరువాత సుమారు 60 రోజుల నుంచి 90 రోజులకు ఎదకు వచ్చేలా జాగ్రత్తలు పడాలి. నాణ్యమైన మేలుజాతి పశువులతో గర్భధారణ చేయించాలి. అప్పుడే సంకరజాతి పశువుల ఉత్పత్తితో పాడి పరిశ్రమ వృద్ధి చెంది అధిక పాలదిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. సంకరజాతి పశువులు 18 నెలలకే యదకు వస్తాయి. దేశవాళి పశువులు మూడేళ్లవరకు యదకు రావు. అలాగే దేశవాళి ఆవులు, గేదెలు ఈత తరువాత 200 రోజులు పాలు ఇస్తాయి. అదే సంకర జాతి ఆవులు, గేదెలు ఏడాది వరకు పాలు ఇస్తాయి. అందువలన సంకరజాతి పశువులు ఎంపికకు ప్రాధాన్యతిస్తే అధిక లాభాలు సాధించవచ్చు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశువులకు సీజనల్‌గా సంక్రమించే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా ఏలిక పాములు, నట్టలు, పిరుదలవాపు, క్షయ, ఎండువ్యాధి తదితర రోగాలు వచ్చే అవకాశం ఉంది. గాలికుంటువ్యాధి, పారుడు రోగం, గొంతువాపు, పొదుగువాపు వ్యాధులు వస్తాయి. వ్యాధులు సోకకుండా పశువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు వాటి ఆవాసాలను శుభ్రం చేస్తుండాలి. ఏదైనా వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యులను సంప్రదించి చికిత్స అందించాలి.

పాడి పరిశ్రమకు ప్రోత్సహకాలు



పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. పశుదాణా, గడ్డిసాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తోంది. అలాగే సబ్సిడీపై పాలుపితికే పరికరాలు అందిస్తోంది. పశువులు కొనుగోలు, పశువుల శాల నిర్మాణానికి రుణాలు కూడా మంజూరు చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలి. పశుపోషణ, పాలదిగుబడి పెంచేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– ఎస్.సురేష్, పశువైద్యాధికారి, గరుగుబిల్లి

పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటదామోదర్



బొబ్బిలి వెంకటదామోదర్

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా బొబ్బిలి వెంకటదామోదర్‌ను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన బొబ్బిలి అప్పలనాయుడు అనారోగ్యంతో గత ఏడాది సెప్టెంబర్ నెలలో మృతి చెందారు. తాత్కాలిక చైర్మన్‌గా బత్తల పకీరునాయుడుకు అధికారులు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి చైర్మన్‌గా బొబ్బిలి వెంకటదామోదర్‌ను, సభ్యులుగా బత్తల పకీరునాయుడు, తెంటు శ్రీరాములు నాయుడును నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఏడాది జూలై నెల వరకు వీరు పదవిలో ఉంటారని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

సేంద్రియ కూరగాయల విక్రయం



కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

సీతంపేట: స్థానిక వైకేపీ కార్యాలయం వద్ద సేంద్రియ విధానంలో సాగు చేసిన కూరగాయలను సోమవారం విక్రయించారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం సేంద్రియ విధానంలో సాగుచేసిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించనున్నట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, సేంద్రియ సాగు ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ

వీరఘట్టం: 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ అన్నారు. వీరఘట్టం వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని సొంత భవనాలు ఉన్న 43 కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మంచినీటి మోటారు ఏర్పాటుకు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రతీ కేంద్రానికి రూ.98 వేలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అంగన్‌వాడీలు బ్యాంకులో ఖాతా తెరవాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ ఉన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచండి



ఏపీఓతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజు

వీరఘట్టం: ఉపాధిహామీ పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు సూచించారు. స్థానిక కార్యాలయంలో ఏపీఓ సత్యంనాయుడుతో ఉపాధి పనులపై సమీక్షించారు. మండలంలో చేపడుతున్న ఉపాధి పనులపై ఆరాతీశారు. ప్రతీ వేతనదారుడికి గరిష్టంగా రోజుకు రూ.272లు వచ్చేలా పనులు కల్పించాలన్నారు. మస్తర్లు, కొలతల నమోదులో అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు.

టీడీపీ టికెట్ స్థానికులకే కేటాయించాలి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను స్థానికులకు కేటాయించాలని ఆ పార్టీ నాయకులు బి.దమయంతినాయుడు, సవర మాలయ్య, ఆరిక లక్ష్మయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకొండ నియోజకవర్గం రిజర్వుడు అవ్వడానికి కారణం సీతంపేట మండలమన్నారు. ఇక్కడ 98 శాతం మంది గిరిజనులే ఉన్నారని, గిరిజనుల కష్టాలు స్థానికులకు తప్ప బయటి వ్యక్తులకు తెలియవన్నారు. గతంలో ఓడిపోయిన వారికి టికెట్ ఇవ్వొద్దన్నారు.

గ్రామదేవతకు పూజలు



గ్రామదేవత ఘటాల ఊరేగింపు

భామిని: మండలంలోని నేరడి–బిలో గ్రామదేవత బంగారమ్మతల్లి సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మండపం నుంచి అమ్మవారి ఘటాలను, పాలజంగిడిలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఫైలేరియా నివారణే లక్ష్యంగా వైద్యసేవలు

సీతానగరం: ఫైలేరియా నివారణే లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్నామని.. ఇందులో భాగంగా రాత్రిపూట ఇంటింటికీ వచ్చి రక్తపూతలు సేకరించే వైద్యసిబ్బందికి ప్రజలు సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పావని, సీహెచ్ఓ ఎస్‌వీ రమణ కోరారు. మండల కేంద్రంలోని మెట్టువీధి, సుంకరివీధి, కుమ్మరివీధి, దేవాంగుల వీధుల్లో హెల్త్ సూపరువైజర్ శర్మ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సోమవారం రాత్రి రక్తపూతలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాత్రివేళ ప్రజలు నిద్రించే సమయంలో కుట్టే దోమల వల్లే ఫైలేరియా సోకుతుందన్నారు. దోమలకు స్థావరాలుగా ఉన్న కాలువల్లో మురుగును తొలిగించాలని, ఖాళీగా ఉన్న కొబ్బరి బురికెలను కాల్చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కుమారి, నవీన్, చంద్రినాయుడు, హరికృష్ణ, జి.శ్రీనివాస్, నారాయణరావు, మూడు గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొని సేవలందించారు.

'అభిలాష'తో ప్రయోజనాలు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అభిలాష' గ్రంథాలయాలతో ఎన్నో ప్రయోజనాలున్నాయని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పెద భోగిలి – 1, 2 సచివాలయాల్లో నిర్వహిస్తున్న 'అభిలాష' సామాజిక గ్రంథాలయాన్ని మండల పరిషత్ ఏఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, గ్రామాల్లో పట్టభద్రులైన నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ జె. వెంకటరావు, జేఏ ఈదుబిల్లి రమేష్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 164 వినతులు



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి



పాలకొండ: వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ వెంకటరమణ

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 164 వినతులు అందాయి. ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భామిని మండల పరిధిలో ఏబీ రోడ్డు నుంచి డోకులగూడ రహదారి పనుల నిర్వహణలో గిరిజన ఇంజినీరింగ శాఖ అధికారుల తీరుపై పలువురు పీఓకు ఫిర్యాదు చేశారు. ఈ రోడ్డు పనులకు మూడేళ్ల కిందట రూ.2 కోట్లు మంజూరు కాగా, పంచాయతీరాజ్‌శాఖ రూ.56.6 లక్షలు ఖర్చు చేసి కొంతమేర పనులు చేసిందని, అదే పనిపై గిరిజన ఇంజినీరింగ్ శాఖ రూ.35 లక్షలు ఖర్చుచేసినట్లు చూపించి బిల్లులు డ్రా చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేయాలని, అలాగే మిగిలిన రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పీఓను కోరారు. సామాజిక భవనం మంజూరు చేయాలని పూతికవలసకు చెందిన సూరయ్య, అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని రేగులగూడ గిరిజను, సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని గోరపాడు గ్రామస్తులు వినతులు అందజేశారు. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, పీఏఓ హరికృష్ణ, డిప్యూటీఈఓ లిల్లీరాణి, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులు సత్వర పరిష్కారం

పాలకొండ: స్పందనలో అందించిన వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వెకంటరమణ తెలిపారు. పాలకొండ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పందనలో అందిన ప్రతీ ఫిర్యాదు త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

కొమరాడ: వసతిగృహంలో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉలిపిరి, పెదఖేర్జిలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతిగృహాలను సోమవారం ఆయన సందర్శించారు. అక్కడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వసతిగృహం అధికారుల వద్ద ఆరాతీసి పలు సూచనలు చేశారు. విద్యార్థులు కచ్చితంగా దోమతెరలు వినియోగించాలని, జ్వరం వస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం కొమరాడ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. 'ఆశా డే'ని కచ్చితంగా నిర్వహించాలన్నారు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వైద్యులు అరుణ్‌కుమార్, శ్యామల్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన



యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై షణ్ముఖరావు

కురుపాం: మండలంలోని ఏగులవాడ పంచాయతీ జొంగరపాడు గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఎస్సై షణ్ముఖరావు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత విద్యా, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని గ్రామస్తులను కోరారు. అనంతరం గ్రామ యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. క్రీడల్లో రాణించాలని యువతకు సూచించారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయాలు, ఆర్‌బీకేలు



కళ్యాణిదుర్గ, మండల ఇంజినీరింగ్ అధికారి

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల, కంబర, కిమ్మి, తూడి, చిదిమి గ్రామాల్లో కొత్తగా నిర్మించిన సచివాలయాలు, కంబర, కిమ్మి, తూడి, బిటివాడ గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని మండల ఇంజినీరింగ్ అధికారి కళ్యాణిదుర్గ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఒక్కో సచివాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు, ఆర్‌బీకే నిర్మాణానికి రూ.21.8 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 22 సచివాలయాలకు 7 సచివాలయాల నిర్మాణాలు పూర్తికాగా, 8 శ్లాబ్‌లు పూర్తయ్యాయని, మరో 5 బేసిమెంట్ స్థాయిలో ఉన్నాయన్నారు. అలాగే 23 ఆర్‌బీకేలకు గాను 6 పూర్తయ్యాయి, మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఆర్‌బీకే, సచివాలయాలను ఈ నెలలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

● ముమ్మరంగా రబీ వరినాట్లు



వరినారు తీస్తున్న వ్యవసాయ కూలీలు

భామిని: మండలంలో రబీ వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నీటి వసతి ఉన్న పొలాల్లో రైతులు రెండో పంటగా వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే నారు మడులు సిద్ధమయ్యాయి. మండలంలోని బొమ్మిక, గురండి, నేరడి–బి, కాట్రగడ–బి, తదితర గ్రామాల్లో రైతులు వరినాట్లు వేయడంలో తలమునకలయ్యారు. పొలాలను దమ్ముపట్టి నాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. బెంగాల్‌కు చెందిన వ్యవసాయ కూలీలతో లైన్ పద్ధతిలో వరినాట్లు వేస్తున్నారు.

రేషన్ బియ్యం పంపిణీ పరిశీలన



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలకొండ: నగరపంచాయతీ పరిధి 7వ వార్డులో రేషన్ సరుకుల పంపిణీని తహసీల్దార్ వరహాలు సోమవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ప్రతీ నెల సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ప్రతీ నెల 5వ తేదీలోగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందించాలని ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



పాలకొండ: విధుల్లో చేరిన తహసీల్దార్‌కు అభినందనలు తెలియజేస్తున్న రెవెన్యూ సిబ్బంది



భామిని: విధుల్లో చేరిన తహసీల్దార్ శ్రీనివాసరావు



గరుగుబిల్లి: తహసీల్దార్ జయకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న టీడీ లక్ష్మీకుమార్, సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: ఎఫ్ఏసీ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్‌కుమార్‌ను అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు



సీతంపేట: ఐటీడీఏ పీఓను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్ ఉమామహేశ్వరరావు



ఎ.వేణుగోపాల్, తహసీల్దార్, కురుపాం



ఆర్.రమేష్‌కుమార్, తహసీల్దార్, కొమరాడ



ఎస్.ఎస్.సత్యనారాయణ, తహసీల్దార్, గుమ్మలక్ష్మీపురం

సీతంపేట/పాలకొండ/గుమ్మలక్ష్మీపురం/కురుపాం/కొమరాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. పాలకొండ, సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల తహసీల్దార్లు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లగా.. వారిస్థానంలో కొత్తవారు బాధ్యతలు చేపట్టారు. సీతంపేట తహసీల్దార్‌గా ఎస్ఏ ఉమామహేశ్వరరావు, పాలకొండ తహసీల్దార్‌గా వరహాలు, భామిని మండల తహసీల్దార్‌గా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా బి.శివశంకర సత్యనారాయణ, కురుపాం తహసీల్దార్‌గా ఎ.వేణుగోపాల్, కొమరాడ తహసీల్దార్‌గా ఆర్.రమేష్‌కుమార్, గరుగుబిల్లి మండల తహసీల్దార్‌గా కె.జయ బాధ్యతలు స్వీకరించారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా ఈఓపీఆర్డీ జి.జగదీష్‌కుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు చేపట్టిన అధికారులకు ఆయా కార్యాలయాల సిబ్బంది, వీఆర్వోలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అధికారులు సిబ్బందితో సమావేశమై ఆయా మండలాల్లోని పరిస్థితులపై ఆరాతీశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.